# విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

- సీపీ అభిషేక్ మహంతి
- ఆర్ముడ్ రిజర్వ్ పోలీసులతో దర్బార్

రాంనగర్, నవంబర్ 9: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో జాన్ విల్సన్ ఓపెన్ థియేటర్‌లో గురువారం సాయుధ దళ పోలీసుల్లోని పలు విభాగాలకు చెందిన అన్ని స్థాయిల అధికారులు, సిబ్బందితో కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు సమర్థవంతమైన సేవలందించడం ద్వారానే పోలీసు శాఖతోపాటు జిల్లాకు గుర్తింపు లభిస్తుందన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉండాలన్నారు. విధి నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రత్యేక విధులు, చెక్‌పోస్ట్, పికెట్స్, అబ్జర్వర్లకు వ్యక్తిగత భద్రత సిబ్బందిగా, పలు ముఖ్యమైన విధులు కేటాయించబడుతాయని, వాటిని నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నిష్పక్షపాతంగా పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించుటలో తమవంతు సహకారం అందించాలన్నారు. చేసే ప్రతి మంచి పనికి రివార్డు అందజేస్తామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పరిపాలన రాజు, ఏసీపీ ప్రతాప్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సురేశ్, రజినీకాంత్, శ్రీధర్‌రెడ్డి, శేఖర్ బాబు, పలు విభాగాలకు చెందిన డాగ్ స్క్వాడ్, బాంబు నిర్వీర్య బృందాలు, మోటార్ ట్రాన్స్ పోర్టు ఆఫీస్ సిబ్బంది, సాయుధ దళ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన ఆర్ముడ్ రిజర్వ్ పోలీసులు

# ఆరో రోజు 45 నామినేషన్లు

- ఇప్పటి వరకు 97 దాఖలు
- మరో నామినేషన్ వేసిన మంత్రి గంగుల కమలాకర్
- చొప్పదండిలో సుంకె రవిశంకర్ మరోసారి
- మానకొండూర్‌లో సాదాసీదాగా రసమయి నామినేషన్
- నేడు స్వీకరణకు ఆఖరి రోజు

కరీంనగర్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ఘట్టం చివరి అంకానికి చేరుకుంది. నేటితో గడువు తీరనుండగా ఆరో రోజైన గురువారం నాలుగు నియోజకవర్గాల నుంచి 36 మంది అభ్యర్థులు 45 నామినేషన్లు దాఖలు చేశారు. కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్ రెండో సారి రెండు నామినేషన్ సెట్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా సయ్యద్ మొయినొద్దీన్ 1, బెల్లపు కరుణాకర్ 1, సామనపల్లి లక్ష్మి ఆబాద్ పార్టీ నుంచి 2, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి 1, అంబటి జోజిరెడ్డి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి మరోసారి 1, స్వతంత్ర అభ్యర్థి మామిండ్ల సందీప్ 1, మోదుంపల్లి శ్రీకాంత్ ధర్మరాజ్ పార్టీ నుంచి ఒక నామినేషన్ దాఖలు చేశారు.

- చొప్పదండి నియోజకవర్గంలో మేడిపల్లి సత్యం (కాంగ్రెస్) –1, సుంకె రవిశంకర్ బీఆర్ఎస్ 3, బంగారి మాధవ్ పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా 1, దాసరి విద్యాసాగర్ స్వతంత్ర అభ్యర్థి 1, విజయ్‌కుమార్ ఎంఎస్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి 1, గౌరు అజయ్ కుమార్ స్వతంత్ర 1, జంగం సాధన ధర్మరాజ్ పార్టీ 1 నామినేషన్ దాఖలు చేశారు.
- హుజూరాబాద్ నియోజకవర్గంలో మధన రాణి బరిగె స్వతంత్ర అభ్యర్థి 1, అంజయ్య పైడిపెల్లి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 1, దేవునూరి శ్రీనివాస్ దళిత యువజన పార్టీ 1, ఈటల జమున బీజేపీ 1, చల్ల తిరుపతిరెడ్డి స్వతంత్ర 1, వీరస్వామి గౌడ్ జక్కె స్వతంత్ర 1, ఈటల రాజేందర్ బీజేపీ 1, పల్లె ప్రశాంత్ బీఎస్పీ 1, మౌటం సంపత్ స్వతంత్ర 1, బండి శ్రీనివాస్ స్వతంత్ర 1, చంద రాజేశ్ స్వతంత్ర 1, కాశెట్టి కుమార్ యువ తులసి పార్టీ తరపున 1 నామినేషన్ దాఖలు చేశారు..
- మానకొండూర్‌లో కవ్వంపల్లి అనురాధ కాంగ్రెస్ 3, ఇరుపుల బాలకిషన్ బీఆర్ఎస్ 2, నిషాని రాంచంద్రం బీఎస్పీ 1, దుబ్బాసి మహేందర్ ఇండియా ప్రజా బందు పార్టీ 2, తోడేటి పవిత్ర సోషలిస్ట్ పార్టీ ఇండియా 1, ప్రభాకర్ మోరె యువ తులసి పార్టీ 2, ఉప్పులేటి లక్ష్మణ్ స్వతంత్ర 1, నిషాని కృష్ణకుమార్ భారత చైతన్య యువజన పార్టీ 1, సంకనపల్లి దేవదాస్ ఆదాబ్ పార్టీ 1 నామినేషన్ దాఖలయ్యాయి.

# సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయం



కార్యకర్తలతో మాట్లాడుతున్న కెప్టెన్ లక్ష్మీకాంతారావు

- సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు

సైదాపూర్, నవంబర్ 9: సీఎం కేసీఆర్ ప్రభుత్వంతోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని, ఎన్నికల్లో ఆయన మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలోని వెన్కేపల్లిలో ఆయన పార్టీ శ్రేణులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్షాలు ఎన్నిమాటలు చెప్పినా బీఆర్ఎస్‌దే విజయమన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఎంతో అభివృద్ధి చేశారని, ఎన్నికల్లో ఆయన విజయానికి ప్రతి కార్యకర్త కష్టపడాలని సూచించారు. కారుగుర్తుకు ఓటువేసి సతీశ్‌కుమార్‌ను మూడోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కొండ గణేశ్, మాజీ జడ్పీటీసీ బెదరకోట రవీందర్, ప్యాక్స్ డైరెక్టర్ మునిపాల రవీందర్, ఉప సర్పంచ్ కొత్త మధుసూదన్‌రెడ్డి, నాయకులు దుంపేటి ఆంజనేయులు, గడ్డం శేఖర్, కొత్త సూర్యప్రకాశ్‌రెడ్డి, వంగ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ అభిషేక్ మహంతి

రాంనగర్, నవంబర్ 9: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గల సమస్యాత్మక, సున్నిత పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలు, అల్లర్లను సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బౌండ్ డౌన్ చేసి పూచికత్తు సొమ్ము మొత్తాన్ని జప్తు చేయాల్సి వస్తుందని, అలాగే జైలుశిక్ష కూడా విధించబడుతుందనే విషయాన్ని వారికి తెలుపాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు అతీతంగా నిష్పక్షపాతంగా పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్యారడైజ్ పాఠశాల చైర్మన్ డా. ఫాతిమారెడ్డి

కొత్తపల్లి, నవంబర్ 9: రేకుర్తిలోని పారడైజ్ పాఠశాల విద్యార్థులు ఐఎంవో ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన గణిత పరీక్షలో అక్షిత, శివాని, హెచ్ శ్రీజ, లాస్య, మేఘన అత్యుత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు సాధించినట్లు పారడైజ్ పాఠశాల చైర్మన్ డా. ఫాతిమా రెడ్డి పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టీ వసంత, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఏవోకే శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ తెలంగాణ పార్టీకి వారాల శ్రీనివాస్ రాజీనామా

కరీంనగర్ రూరల్, నవంబర్ 9: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన వైఎస్ఆర్ తెలంగాణ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వారాల శ్రీనివాస్ పార్టీ పదవికి, క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం ఆయన పార్టీ అధ్యక్షుడికి రాజీనామా పత్రం అందజేశారు.

# కదం తొక్కిన గులాబీ దండు

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 9: జగిత్యాలలో గురువారం గులాబీ దండు కదం తొక్కింది. నియోజకవర్గం నలుమూలల నుంచి గులాబీ దండు రావడంతో పట్టణం గులాబీ వనాన్ని తలపించింది. ఏ రోడ్డు.. ఏ వీధి చూసినా జనమే.. ఇసుకేస్తె రాలనంత జనం.. చీమల పుట్టలోంచి చీమలు బయటకు వచ్చినట్లుగా జనం తరలివచ్చారు. జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ గురువారం నామినేషన్ పత్రాలు దాఖ లు చేశారు. ఎమ్మెల్యే నామినేషన్ కార్యక్రమానికి జగిత్యాల పట్టణం, జగిత్యాల రూరల్, రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి నాయకులు భారీ సంఖ్యలో జనసమీకరణ చేసి పట్టణానికి తరలించారు. తొలుత మోతె రోడ్డులోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న గులాబీ దండు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వెంట భారీ ర్యాలీగా పట్టణ ప్రధాన వీధుల గుండా కదంతొక్కారు.



బోనాలు, బతుకమ్మలను ప్రదర్శిస్తున్న రాష్ట్ర కెడెట్లు

# రాష్ట్ర కెడెట్ల ప్రదర్శన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 9: విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపులో రాష్ట్ర, జిల్లా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల నుంచి వలంటీర్లు పాల్గొనగా, వారికి కంటింజెంట్ లీడర్లుగా జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మార్కొండ శకుంతల, హైదరాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్సెస్ అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గాయత్రి వ్యవహరిస్తున్నారు.